

కథా కౌముది

“మంకెన పూలు” -సుజాత గొడవర్తి, అశ్వాపురం, తెలంగాణా

“విశ్వావసు” నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
30 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
‘నా మొట్టమొదటి కథ’ విభాగంలో ప్రశంసా పత్రం పొందిన కథ

జగదోద్ధారణ ...

అంటూ పురందరదాసు కీర్తనను తంబుర మీటుతూ ఆలపిస్తోంది శారద. రాంప్రసాద్ లాన్ లో కేన్ చైర్లో కూర్చొని కాఫీ తాగుతూ ఆమె గాత్రాన్ని ఆస్వాదిస్తున్నాడు.

వాతావరణం పొడిగా, ఒక మోస్తరుగా వుంది. ఫోన్ అందుకొని చూస్తున్నాడు. అన్ని గ్రూపుల్లోనూ రాబోయే రోజుల్లో తీవ్రమైన గాలులు వీస్తాయనీ, చుట్టుపక్కల ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా వుండాలన్న, ప్రభుత్వ హెచ్చరికలను చూస్తున్నాడు.

శారద కాఫీ కప్ తో లాన్ లోకి వచ్చింది.

"రా శారదా, పొద్దునే నీ మధురమైన గొంతు వినందే కాఫీ చుక్క రుచిగా గొంతు దిగదు” అని శారదకు కితాబిచ్చాడు రాంప్రసాద్.

"అతని పక్కన కూర్చుంటూ, మూడేళ్ల తరువాత పిల్లలు వస్తున్నారు. ఆకాష్ కి ఫోన్ చేసి స్పెషల్స్ ఏమి చెయ్యమంటాడో అడగండి.” అంది శారద.

"వద్దు శారదా, నీకు తోచింది చెయ్యి. ఇంకోమాట, ఇప్పటి కాలం పిల్లలను మనం ఏమీ అడగకూడదు. దాని పర్యవసానం చూశావుగా." అన్నాడు రాంప్రసాద్.

"హ్మ్మ్. పోనిలేండి, ఇప్పటికైన ప్రియకి కోపం తగ్గి మళ్ళీ ఈ ఇంట కాలుపెడుతోంది అదిచాలు. వాళ్ళు ఎప్పుడు బయలుదేరుతున్నదీ ఫోన్ చేసి అడిగారా?" అంది శారద.

"లేదు శారదా, ఇప్పుడే చేస్తాను." అని ఫోన్ చెయ్యబోతుండగా, ఫోన్ మోగింది. "నూరేళ్ళు. వాడే చేస్తున్నాడు" "హలో..! ఆకాష్ !"

"హలో నాన్నా! అక్కడ పరిస్థితి ఎలావుందీ? ఛానల్స్ అన్ని లాస్ ఏంజిల్స్ ప్రాంతం మంటల్లో చిక్కుకుందని చూపెడుతున్నాయి. మేము వద్దామంటే ఫ్లైట్స్ కేన్సిల్ అయ్యాయి. మీరు వెంటనే వేరే చోటికి వెళ్ళండి." ఫోన్ కట్ అయ్యింది.

★★★

బయట బుల్ హార్న్ లో ఆ ప్రాంతం వాళ్ళని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకి వెళ్ళమని, హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

ఆకాశంలో హెలికాప్టర్లు మంటలనార్పే ప్రయత్నాల్లో ఉన్నాయి. పనివాళ్ళు అంతా హుటాహుటిన అక్కడనుండి బయలుదేరారు.

"పద శారదా! వాతావరణం మారిపోయింది, వేడిసెగలు వస్తున్నాయి. ముందు ఉన్నపళంగా మనం ఇక్కడనుండి బయటపడడం మంచిది." అన్నాడు కంగారుగా రాంప్రసాద్.

"ఏవండీ? ఏంటండీ ఇదీ? ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లగలం" అంటోంది శారద భయంగా రోదిస్తూ. ఇంపార్టెంట్ డాక్యుమెంట్స్ తీసుకొని శారద చేయిపట్టుకొని బయటకు నడిచాడు రాంప్రసాద్.

ఇద్దరూ ఒకసారి తమ కలలసౌధాన్ని కన్నులారా చూసుకొని బరువెక్కిన హృదయాలతో అక్కడనుండి ఇవతలకి వచ్చారు. వాలంటీర్స్ ఆ ప్రాంతం వాళ్ళని శరణార్థుల శిబిరాలకు చేర్చారు.

ఒకప్పుడు అభాగ్యులకు చేతినిండా దానం చేసుకున్న ఈ దంపతుల చేతుల్లో "డోంట్ బీ అఫ్రైడ్. గాడ్ హాస్ సేవ్డ్ యూ. ప్లీజ్ టేక్ దీస్"అంటూ వారికి బట్టలు, తిండి ఇస్తుంటే శారద దుఃఖం కట్టలు తెంచుకొని వరదలై పారింది.

ఐనవాళ్ళెవరూ రావడానికి, మాట్లాడడానికి దారులు లేవు. కమ్యూనికేషన్ వ్యవస్థ అంతా కూడా దారీతెన్నూ లేకుండా అయ్యింది. తమవాళ్ళు ఎవరైనా వస్తారేమో అని వారం రోజులుగా ఎదురుచూస్తున్నారు వాళ్ళంతా.

"రాం ప్రసాద్ గారంటే మీరేనా?" అడిగాడొకతను. "ఎస్, ఐ యాం రాంప్రసాద్" అన్నాడు.

"నమస్తే సర్, నాపేరు వినోద్. మీ క్రాంతి, నేను ఫ్రెండ్స్. ఇవి ఎలాగైనా మీకు అంద జేయమన్నాడు. ఈ కవర్లో ఫ్లైట్ టికెట్స్, క్యాష్ వున్నాయి. నేనిక్కడ ఎయిర్ పోర్టులో జూనియర్ ఎగ్జిక్యూటివ్ గా పని చేస్తున్నాను. ఇది నా ID. మీరు నాతో వస్తే మిమ్మల్ని సేఫ్ గా ఫ్లైట్ ఎక్కిస్తాను" అని కవర్ రాంప్రసాద్ కి ఇచ్చాడు. ఆ దంపతులిద్దరూ కన్నీళ్ళ పర్యంతం అయ్యారు.

రాంప్రసాద్ అతని చేతులు పట్టుకొని "ఈ కష్ట సమయంలో భగవంతుడే మీ రూపంలో వచ్చాడు. థ్యాంక్స్ ఎ లాట్ వినోద్ గారు" అన్నాడు. "క్రాంతి మీ గురించి అంతా చెప్పాడు. మీకు సాయం చేయడం నాకు హ్యాపీగా ఉంది సర్" అని వాళ్ళిద్దరినీ తనతో తీసుకొని వెళ్లి ఇండియాకి ఫ్లైట్ ఎక్కించాడు.

ఫ్లైట్ టేకాఫ్ అయ్యింది. దంపతులిరువురూ విండోలోంచి చూశారు. కళ్ళముందు తమ ఆశలసౌధం బుగ్గిపాలవడం చూసి వాళ్ళ హృదయాలు నీరైపోయాయి.

ఫ్లైట్ మేఘాల్లోంచి ముందుకు సాగుతోంది. రాంప్రసాద్ మనసు ఆకాశంలో తేలియాడే మబ్బు తునకలా తేలికగా వుంది. అలసిన మనసు సేద దీరుతోంది. కాసేపు కళ్లుమూసుకున్నాడు.

★★★

రాంప్రసాద్ తమ్ముడు లక్ష్మణ్. ఉద్యోగం వచ్చినా వెళ్లకుండా ఊళ్ళోనే వ్యవసాయం చేసుకుంటూ తల్లిదండ్రులకు ఆసరగా ఉండిపోయాడు. ఇతని భార్య రాధిక.

రాంప్రసాద్ అప్పట్లోనే ఇంజనీరింగ్లో యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్. వివాహమైన తరువాత ఐదు ఏళ్ళు ఇండియా లోనే పేరున్న పెద్ద కంపెనీలో ఇంజనీరుగా పనిచేశాడు. తరువాత అమెరికాలో ఉద్యోగం వచ్చింది. శారద చదువుకున్నదైనా, గృహిణిగా ఉండడమే ఇష్టమంది. తను ఆమె ఇష్టాన్ని గౌరవించాడు.

వాళ్ళు అమెరికా వెళ్ళిన కొత్తల్లో ప్రతిఏటా ఇండియా వెళ్లేవారు. కొన్నిరోజులు కుటుంబ సభ్యులతో సంతోషాలను పంచుకొనేవారు. సంపాదన, పనిఒత్తిడి, హోదా, బాధ్యతలు అన్నీ పెరగడంతో ఇండియాకి వెళ్ళడం కుదరలేదు.

శారద మాత్రం సమయం చూసుకొని రోజూ తనవాళ్ళతో కాసేపు ఫోన్ లో మాట్లాడుతూ ఉండేది. వీళ్ళు విదేశీవాసులుగా స్థిరపడి 30 ఏళ్లు దొర్లిపోయాయి. సొంత కంపెనీలు పెట్టి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదిగారు.

కాలిఫోర్నియలోని లాస్ ఏంజల్స్ లో అధునాతన సౌకర్యాలతో పెద్ద భవంతి నిర్మించుకున్నారు. కొడుకు ఆకాష్ ను కూడా మంచి విలువలతో పెంచారు.

అతను తన సహోద్యోగిని అయిన తెలుగమ్మాయినే ప్రేమించాడు. అమ్మాయి తల్లిదండ్రులు ఇండియాలో ఉంటారు. ఇరువురి తల్లిదండ్రుల అంగీకారంతో వైభవంగా అమెరికాలోనే వాళ్ళ వివాహం జరిగింది.

పెళ్ళై, ప్రియని అత్తవారింట్లో దిగబెట్టి, ఇండియాకి వెళ్ళేరోజు, ఆమె తల్లి ప్రియని దగ్గరకు తీసుకుని, "చూడమ్మా! మీ అత్తమామలు చాలా మంచివారు. నువ్వు పెడసరంగా ఉంటే వాళ్ళు ఇబ్బంది పడతారు. జాగ్రత్తగా ఉండు తల్లీ" అంది కూతురి గడ్డం పట్టుకొని.

"నాకు తెలుసమ్మ, పదపద" అంటూ ఆమెను కిందకి తీసుకొచ్చింది ప్రియ.

వియ్యంకుడు, వియ్యపురాలికి వెళ్లొస్తామని చెప్పి కారెక్కారు ప్రియ తల్లిదండ్రులు.

రోజులు గడుస్తున్నాయి. కోడలొచ్చాకా ఇల్లు మునుపటి కంటే ఇంకా సందడిగా, హ్యాపీగా ఉంది.

ప్రియ కూడా అందరితో కలిసిపోయింది. వాళ్ళ అలవాట్లను అర్థం చేసుకుంటోంది. ఆ ఇంట్లో చాలా కంఫర్ట్ ఫీల్ అవుతోంది.

ఇదిలా ఉండగా ఒకనాడు నలుగురూ కలిసి భోజనం చేస్తున్న సమయంలో. ప్రియకి ఫోన్ కాల్ వచ్చింది. "హలో! హాయ్ డానీ!. ఈస్ ఇట్. వెన్ షుడ్ వియ్ బోర్డు ద ఫ్లైట్?
నైస్. ఒకే, సీ యూ ఎట్ ద ఎయిర్పోర్ట్ టుమారో. బాయ్ డానీ".

ప్రియ ఫోన్ పెట్టేసి,"రేపు మార్నింగ్ ఫ్లైట్ కు అఫీషియల్ టూర్ సింగపూర్ కి" అని చెప్పింది వాళ్ళకు.

"నైస్. మే యువర్ ట్రిప్ బీ ఎ సక్సెస్" అన్నాడు ఆకాష్.

"జాగ్రత్తగా వెళ్ళిరామ్మా" అన్నారు అత్తమామలు.

"థ్యాంక్ యూ ఆల్" అని తన సింగపూర్ ప్రయాణానికి లగేజ్ రెడీ చేసుకోడానికి మేడపైకి వెళ్ళింది ప్రియ.

ప్రియ సింగపూర్ వెళ్ళి 15 రోజులు గడిచాయి.

ఒకనాడు ఉదయం శారద గార్డెన్ లో పూలు కోస్తోంది. ఇంటిముందు కారు ఆగింది. ప్రియ నల్లని స్లీవ్లెస్ మినీ ఫ్రాక్, వేసుకొని దిగింది.

"కమ్ ఇన్ డానీ, లెట్స్ హావ్ ఎ కాఫీ" అంది ప్రియ.

"నో, నాట్ నౌ. ఐ విల్ కమ్ సమ్ అదర్ డే." అన్నాడు డానీ.

"యువర్ విష్" అంటూ అతనికి బై చెప్పి, లగేజ్ తీసుకొని ఇంట్లోకి వెళ్ళింది.

రాంప్రసాద్, ఆకాష్ హాల్లో కూర్చొని ఉన్నారు.

హాయ్ ఆకాష్, హాయ్ మావయ్యా, అని సోఫాలో కూర్చొన్న ఆకాష్ పక్కన కాలు మీద కాలేసుకుని కూర్చుంది. రాంప్రసాద్ అక్కడ నుండి లేచి వెళ్ళబోయాడు.

"కూర్చోండి నాన్నా" అన్నాడు ఆకాష్.

"పర్వాలేదు, మీరు మాట్లాడుకోండి. నాకు గార్డెన్లో పనుంది" అని కదిలాడు.

రాంప్రసాద్ అక్కడ నుండి బయటకు వస్తుంటే శారద చూసింది.

"ఏంటి, బ్రేక్ఫాస్ట్ చెయ్యరా?" అడిగింది శారద.

"తరువాత తింటాను. పిల్లలు మాట్లాడుకుంటున్నారు. నేను అక్కడ ఎందుకని.., ఆ..శారదా! తరువాత అమ్మాయిని ఫ్రెష్ అయ్యి రమ్మను, నలుగురం కలిసి బ్రేక్ ఫాస్ట్ చేద్దాం" అన్నాడు.

శారదకు అర్థమయ్యింది.

లోపలికి వచ్చిన శారదను చూసి ప్రియ, "హలో అత్తయ్యా! ఎలా ఉన్నారు? "ఏ సర్ప్రైజ్ ఫర్ యూ. కళ్ళు మూసుకోండి" అని బ్యాక్ బ్యాగ్ లోంచి ఒక బాక్స్ తీసి ఆమె చేతిలో పెట్టి," నౌ ఓపెన్ ఇట్." అంది.

పైన రేపర్ తీసి,దానిమీద పేరు చదివి, "వైన్?" అంది శారద.

"ఎస్, దిస్ ఈజ్ ఎ వెరీ ఎక్స్పెన్సివ్ వైన్. ఇఫ్ యు డ్రింక్ దిస్, యువర్ గ్లామర్ విల్ బి డబుల్ అత్తయ్య" అంది ప్రియ.

శారదకి ఏమనాలో అర్థం కావడం లేదు. "సారీ ప్రియా, ఇది మన కల్చర్ కాదు. ఇలాంటివి నాకు నచ్చవు. నువ్వు ఆల్కహాల్ తీసుకుంటావని నాకు ఇప్పుడే తెలిసింది. ఇంకోసారి ఇలాంటి పని చేయకు. ఆ డ్రెస్ లో నిన్నిలా చూడ్డానికి ఇబ్బందిగా ఉంది. ఇమ్మీడియట్గా ఫ్రెషప్ అయ్యి కిందకిరా. ఒక ఇండియన్ మదర్ గా ఈ విషయం నీకు చెప్పొచ్చు అనుకుంటున్నాను" అంది తనకు కలిగిన అసౌకర్యాన్ని దాచుకుంటూ శారద.

శారద హితబోధ ప్రియకి నచ్చలేదు. బాటిల్ ని పక్కనున్న డస్ట్ బిన్లోకి విసిరి కొట్టి బాత్రూమ్లోకి వెళ్ళి తలుపువేసుకుంది. ఆమె బయటకి వచ్చాక, ఆకాష్ "సారీ ప్రియా! అమ్మ మాటలను మరోలా తీసుకోకు. ప్రశాంతంగా ఉన్నప్పుడు అమ్మ అలా ఎందుకు చెప్పిందో ఆలోచించు. అంతా నీ మంచి కోసమే" అన్నాడు.

"తెలివిగా మాట్లాడి మీఅమ్మకు సపోర్ట్ చేస్తున్నావు ఆకాష్. పెళ్లికాకముందు నా ఇష్టాలను గౌరవించిన వాడివి, ఇవాళ ఆలోచించమంటున్నావు! అంటే నువ్వుకూడా నామీద పెత్తనం చెయ్యాలనుకుంటున్నావు? ఐయాం నాట్ ఎ చైల్డ్. ఐకాంట్ డూ ఎవ్రిథింగ్ యూ పీపుల్ సే. ఐ విల్ నాట్ స్టే ఇన్ దిస్ డెవిల్స్ డెన్ ఫర్ ఎ మోమెంట్. ఇఫ్ యూ వాన్ట్ టు బి విత్ మి, ఫోలో మీ. అదర్వైస్ గుడ్ బై." అని ఆకాష్ వద్దన్నా వినకుండా, బట్టలు సర్దుకొని కిందకి దిగింది.

రాంప్రసాద్, శారద చూస్తున్నారు. ఆకాష్, తన తల్లి దగ్గరకొచ్చి, "అమ్మా! నువ్వు మందలించినందుకు తను అలిగి వెళ్ళిపోతానంటోంది. ఉండమని చెప్పమ్మా" అని తల్లిని రిక్వెస్ట్ గా అడుగుతున్నాడు ఆకాష్.

శారద, ప్రియను ఒక్క నిముషం అగమని, "నా మాటలు నిన్ను బాధ పెట్టుంటే క్షమించమ్మా. నువ్వు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నావు కాబట్టి, ఆకాష్ కూడా నీతో వస్తాడు. మీరిద్దరూ ఎక్కడున్నా సుఖంగా ఉండాలి" అంది శారద.

"కరెక్ట్, గో విత్ హెర్ మై డియర్ సన్"అన్నాడు రాంప్రసాద్.

"కమ్ ఆన్ ఆకాష్! లెట్స్ గో" అంది ప్రియ కోపంగా చూస్తూ.

ఆకాష్ క్షమించమన్నట్లు తల్లిదండ్రుల వైపు చూశాడు. ఆకాష్ ని దగ్గరకు తీసుకొని, కన్నీళ్లు తుడుచుకున్నారు.

అలా వెళ్లినవాళ్ళు, న్యూయార్క్ లో సెటిల్ అయ్యారు.

తరువాత ప్రియ కన్సీవ్ అయ్యి బాబుపుట్టిన విషయం ఆకాష్ తన తల్లిదండ్రులకు తెలియపరచాడు. వాళ్ళు సంతోషించారు.

మనవడి మూడవ పుట్టినరోజని ప్రియ తల్లిదండ్రులు అమెరికా వచ్చారు. ఆకాష్ తన పేరెంట్స్ ని కూడా పిలుద్దామన్నాడు. దానికి ప్రియా ఒప్పుకోలేదు.

"వీడు పుట్టి రెండేళ్లు నిండాయి అయినా, మనవడిని చూసే అదృష్టం లేదు మా వాళ్ళకి. పూర్ పేరెంట్స్" అని అసహనంగా ఆఫీసుకి వెళ్ళిపోయాడు ఆకాష్.

అవేమీ పట్టనట్టు ఆఫీసుకి బయలుదేరుతూ "అమ్మా! మిమ్మల్ని గుడి దగ్గర దింపి వెళ్తాను. బాబు జాగ్రత్త. అక్కడ నుండి మాల్ కి వెళ్ళండి. నేను ముందే పర్మిషన్ తీసుకుని అక్కడికి వచ్చేస్తాను. బాబు బర్త్ డేకి షాపింగ్ చెయ్యాలి" అంది తల్లితో ప్రియ.

"త్వరగా వస్తావుగా? ఈ చలి వాతావరణం మీ నాన్నకు పడదు. ఇబ్బంది పడతారు" అంది తల్లి. "లేదమ్మా, త్వరగానే వచ్చేస్తాను" అంది ప్రియ.

సాయంత్రం అయ్యింది. అక్కడి చలికి ప్రియ వాళ్ళ నాన్నకు ఆయాసం మొదలయ్యింది. "

ప్రియ రావడానికి ఆలస్యమవుతుందేమో. మీకు కూడా పొద్దున్నుంచి రెస్ట్ లేదు. వీడు ఏడ్చేడ్చి ఇప్పుడే పడుకున్నాడు. క్యాబ్ బుక్ చెయ్యండి ఇంటికి వెళ్దాం." అంది ఆవిడ.

ఇంతలో ప్రియ, ఆకాష్ అక్కడికి వచ్చారు. ప్రియ, ఆఫీస్ నుండి వస్తూ ఫ్రెండ్ ఇంట్లో పార్టీకి అటెండై ఆ పార్టీ డ్రెస్ తోనే మాల్ కి వచ్చింది.

"ఏంటి! నాన్నకు బాగోలేదా? ఏం నాన్నా! ఆయాసంగా ఉందా?" అని ఎదురుగా నిలబడి తండ్రి భుజం మీద చెయ్యివేసి అడిగింది. బట్టలు కంటే శరీరమే ఎక్కువగా కనబడుతున్న కూతురి వంక చూడలేక, భుజం మీద చేయి తీస్తూ, "క్యాబ్ బుక్కైంది పద" అని భార్యని పిలిచాడు.

"సరే ప్రియా, కీస్ ఇస్తే ఇంటికి వెళ్తాం" అని ఆవిడ కూతురు దగ్గర ఇంటి కీస్ తీసుకొని, క్యాబ్ ఎక్కారు.

"ఖర్మ, ఈ పేరెంట్స్ ఎప్పుడు మారతారో... వాళ్ళ పనులైతే చాలు" అనుకుంది విసుగ్గా ప్రియ.

"నీకు అప్పుడే చెప్పాను. డ్రెస్ మార్చుకుంటే బాగుంటుందని. ఆయన నీకు చెప్పలేక ఇబ్బంది పడ్డారు" అన్నాడు ఆకాష్.

"నెవర్ మైండ్, నా డ్రస్సు, నా యిష్టం. సరే, బర్త్ డేకి మనకి, బాబుకి డ్రెసెస్ సెలక్ట్ చేస్తాను . ఈలోగా నువ్వు నా సెల్ ఫోన్ కి మంచి కవర్ కొని సెకండ్ ఫ్లోర్ కి వచ్చేయ్.." అని ఆకాష్ కి ఫోన్ ఇచ్చి, సెకండ్ ఫ్లోర్ కి వెళ్ళడానికి ఎస్కలేటర్ ఎక్కింది. ఆమె వెనుక ఇద్దరు ఆకతాయిలు ప్రియని చూస్తూ, ఏవో మాట్లాడుకుంటూ నవ్వుతున్నారు.

డెలివరీ అయ్యాక కొద్దిగా బొద్దుగా అయ్యింది ప్రియ. దానికి తోడు ఆ వేసుకున్న డ్రెస్ ఆమె ఒంటికి ఎబ్బెట్టుగా ఉంది. అప్పుడప్పుడు తనకు తెలియకుండానే డ్రెస్ ని సర్దుకుంటోంది. పైకి వెళ్లి లేడీస్ ఫ్యాషన్ ఔట్లెట్ లో రెండు మూడు డ్రెస్సులు సెలెక్ట్ చేసి తీసుకొని, ట్రయల్ రూంకి వెళ్తోంది.

ఆ ఇద్దరు ఆకతాయిలు ఆమె వెనకే ఫాలో అవుతూ, సడెన్ గా ఆమె డ్రెస్ బ్యాక్ జిప్ లాగి, అక్కడ నుండి చటుక్కున జారుకున్నారు. ఏమయ్యిందో అర్థం కాక చూస్తోంది. అక్కడ కొంతమంది ఆమెని చూసి నవ్వుకుంటూ వెళ్తుంటే, ఇంకొంతమంది పట్టనట్లు వెళ్లిపోతున్నారు.

ఎవరో లోకల్ యూత్ "స్పైసీ కర్రీ" అనడం వినిపించింది. అప్పుడు చూసుకుంది తన డ్రెస్ ని.

అవమానంతో, చేతిలో ఉన్న డ్రెస్సెస్ తో ఒళ్ళు కవర్ చేసుకొని ఏడుస్తోంది. ఇంతలో ఆకాష్ వచ్చి, విషయం తెలుసుకొని, ట్రయల్ రూముకి వెళ్లిరమ్మని ఒక పక్కకి నిలబడ్డాడు. లాంగ్ స్కర్ట్, ఫుల్ స్లీవ్స్ టాప్ వేసుకొని వచ్చి, అంతక్రితం వేసుకున్న కురచ డ్రెస్ ను అక్కడున్న బిన్ లో పడేసింది. డ్రెస్ కి పేమెంట్ చేసి ఇంటికి వెళ్ళిపోయారు.

కారు దిగి లోపలికి వెళ్ళి, తల్లిని పట్టుకొని భోరున ఏడ్చేసింది. ". పెద్దవాళ్ళ మాటలు పెడచెవిన పెడితే, ఏమి జరుగుతుందో అనుభవమయ్యింది. నాకు బుద్ధొచ్చింది" అంటూ వెక్కివెక్కి ఏడుస్తోంది.

విషయం అర్థంకాక ఆకాష్ వైపు చూసింది ఆమె తల్లి. "ఏమిలేదు, డోంట్ వర్రీ" అని కళ్ళతో సమాధానమిచ్చాడు ఆకాష్.

ప్రియ కళ్ళు తుడిచి, సెల్ ఫోన్ చేతికిస్తూ, "ప్రాణం లేని ఈ వస్తువు కవర్ మీద చూపించిన శ్రద్ధ, నీ ఒళ్ళు కవర్ చేసుకోవడంలో చూపించి వుంటే బాగుండేదేమో ప్రియా" అన్నాడు ఆకాష్.

"సారీ ఆకాష్. ఐయాం ద వర్స్ట్ పర్సన్. ఐ హర్ట్ యువర్ పేరెంట్స్. నౌ ఐ హేవ్ కమ్ టు మై సెన్స్. ఈ పొగరుదానికి ఇలా జరగాల్సిందే. మనం లాస్ ఎంజల్స్ కి వస్తున్నామని మావయ్యకి ఫోన్ చేసి చెప్పు. అత్తయ్యని క్షమాపణ అడగాలి." అంది ప్రియ.

ఆ తరువాత ఆకాష్ ఇదంతా తన తల్లిదండ్రులకు చెప్పకుండా, లాస్ ఏంజిల్స్ వస్తున్నట్లు ఫోన్ చేశాడు.

ఇదీ జరిగిన కథ.

ఫ్లైట్ ల్యాండ్ అవుతోంది. సీట్ బెల్ట్ పెట్టుకోమన్న పైలట్ అనౌన్స్మెంట్ తో రాంప్రసాద్ కళ్ళు తెరిచాడు.

చాలా కాలానికి మళ్ళీ తమ సొంత గడ్డ పై కాలుపెడుతున్నారు ఆ జంట. రాంప్రసాద్ మనసు ఆనందంతో చిరుగంటల సవ్వడి చేస్తోంది. వాళ్ళని రిసీవ్ చేసుకోడానికి క్రాంతి, అతని భార్య సాక్షి వచ్చి, స్వాగతం పలికారు. వాళ్ళని చూడగానే ప్రాణం లేచొచ్చింది రాంప్రసాద్ కి.

కుందనపు బొమ్మలా పద్ధతిగా ఉన్న సాక్షిని చూసి మురిసిపోయింది శారద.

ఆమెను చూసి, "అమ్మా సాక్షి! నీ వయసప్పుడు, ఇదిగో... మీ అత్తయ్య నీలాగే ఉండేది." అన్నాడు రాంప్రసాద్ శారదను చూపిస్తూ.

"అవును పెదనాన్న, నాక్కూడా సాక్షిని చూస్తే అలాగే అనిపిస్తుంది." అన్నాడు క్రాంతి. సాక్షి సిగ్గుతో కూడిన నవ్వు నవ్వింది.

శారద సంతోషపడిపోయింది.

నలుగురూ కారులో బయలుదేరారు. చాలా దూరం ప్రయాణం చేశాక, సొంత ఊరు శివార్లలోకి చేరుకున్నారు. "పెదనాన్నా, ఒకసారి అటుచూడండి. పాతికేళ్ల క్రితం ఈ వాడ అగ్నిప్రమాదానికి గురైనప్పుడు ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయి. ఈ విషయం తాతగారు మీకు చెప్పినప్పుడు, వాళ్ళకోసం పక్కా ఇళ్లు కట్టించమని డబ్బు పంపారుట కదా! ఆ డబ్బుతో కట్టించిన కాలనీ ఇది" అని క్రాంతి చెబుతుండగా,

"ఇదేంటి మా పేర్లు పెట్టారు!" అన్నాడు ఆశ్చర్యపోతూ.

"ఈ వాడ వాళ్ళు, మీకు కృతజ్ఞతలు ఇలా తెలుపుకున్నారు" అన్నాడు క్రాంతి.

ఆ బాధ ఎలా ఉంటుందో అనుభవించారు కాబట్టి, ఆ దంపతుల కళ్ళు చెమ్మగిల్లాయి.

కారు మెల్లిగా పోనిస్తూ, "ఇదంతా మన చెరకు తోట, ఇక్కడ పండించిన చెరకుతో తయారైన బెల్లం మన ఊరి వాళ్ళకు సరిపోగా, మిగిలింది మార్కెట్టుకు వెళ్తుంది.

ఈ కుడివైపు, మిల్క్ ఫ్యాక్టరీ కూడా మనదే. రోజూ వేల లీటర్లు కల్తీలేని పాలను సరఫరా చేస్తున్నాము.

మీ ఆలోచనలను నాన్న ఆచరణలో పెట్టారు."అన్నాడు తండ్రిని గుర్తుచేసుకుంటూ క్రాంతి.

"వాడు ప్రాణాలతో లేకపోయినా, నా ప్రాణంలో నిండిపోయి ఉన్నాడు. నాడు రాముడు సంజీవనిని తెప్పించి తన తమ్ముడ్ని కాపాడుకున్నాడు. కానీ నేను ఎన్ని సంజీవనులను తెప్పించినా వాడ్ని కాపాడుకోలేక పోయాను.

మహమ్మారి లుకేమియా చివరిదశలో బయటపడి, వైద్యానికి కూడా లొంగకుండా వాడ్ని మింగేసింది. తాతయ్య, నాయనమ్మ చనిపోయాక ఆ బాధనుండి పూర్తిగా కోలుకోక ముందే, వాడ్ని కూడా..." అంటూ బాధపడ్డాడు రాంప్రసాద్.

"మన దురదృష్టం పెదనాన్నా" అన్నాడు క్రాంతి గంభీరంగా.

"పెద్దమ్మా! ఆ స్కూల్ పేరు చదువు, 'శారదా విద్యానిలయం' , ఇది పేరుకే ప్రైవేటు స్కూల్. కానీ అన్నీ ఉచితం. తల్లిదండ్రులకు ఆర్థిక భారం లేని శాంతి నికేతనం. ఎక్కడెక్కడ నుంచో వచ్చి ఇక్కడ చదువుకుంటున్న పిల్లలున్నారు." అన్నాడు క్రాంతి.

"నువ్వు చాలా ఎత్తుకు ఎదిగి పోయావురా కన్నా. మీ నాన్న, తాతగారు ఉండుంటే ఎంత సంతోషించేవారో." అంది శారద.

"వాళ్ళ ఆశీస్సులు మీ ద్వారా మాకు అందుతున్నాయి పెద్దమ్మా.

నాన్న జబ్బు పడే వరకూ, మన పొలాలు, స్థలాలు ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో నాకు తెలియదు. ఒకనాడు నాన్న, మన ప్రాపర్టీస్ డాక్యుమెంట్స్ చూపించి, అందులో పెదనాన్న తన వాటా ఆస్తి కూడా మొత్తం నాన్న పేర రాసారని చూపించారు.

పెదనాన్నకి తన జబ్బు విషయం తెలిస్తే తట్టుకోలేరనీ, తెలియనివ్వద్దన్నారు నాన్న. కానీ, తమ్ముడి కోసం ఇంత చేసిన ఆయనకి చెప్పడం నా కనీస బాధ్యతని ఆనాడు పెదనాన్నకి విషయం చెప్పాను. పెదనాన్న వైద్యానికి ఎంతో ఖర్చు చేశారు. అయినా ఫలితం లేకపోయింది" అన్నాడు క్రాంతి.

నా దురదృష్టం కాకపోతే కరోనా కాలం. ఆ సమయంలో ఫ్లైట్స్ లేవు. వాడి చివరిచూపు కూడా దక్కలేదు" అని బాధగా నిట్టూర్చాడు రాంప్రసాద్.

"పెదనాన్నా! ఇది మన ఊరి రామాలయం. ఆ పురాతన కట్టడాన్ని కదపకుండా, మంచి శిల్పులతో రెనోవేట్ చేయించాము. సాయంత్రం వద్దాం, చాలా ప్రశాంతంగా ఉంటుంది" అన్నాడు.

"డబ్బు వుంటే సరికాదు. అది సద్వినియోగం కావాలిరా క్రాంతి. అది నువ్వు చేస్తున్నందుకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు రాంప్రసాద్.

"అంతా మీ బ్లెస్సింగ్స్. ఇదిగో వచ్చేశాం" అంటూ హార్న్ మోగించాడు. వాచ్ మన్ గేట్ తీశాడు. విశాలమైన ప్రాంగణంలో కార్ ముందుకు నడుస్తోంది. క్రాంతి కట్టుకున్న భవనాన్ని చూస్తూ, దానికి కుడి పక్కన తన తండ్రి కట్టుకున్న మండువా లోగిలిని కూడా చూశాడు.

పెళ్లయ్యాక కొంతకాలం తను, శారద కాపురం చేసిన బృందావనం. దాన్ని అలాగే చూస్తున్నాడు. అది గమనించిన క్రాంతి కారుని అటు తిప్పాడు.

రాంప్రసాద్ మొహం వెలిగి పోతోంది. అప్పట్లో ఎంత శుభ్రంగా ఉండేదో, ఇప్పుడూ అంతే శుభ్రంగా ఉంది. గుమ్మానికి పచ్చతోరణం శుభప్రదంగా కనబడుతోంది.

కారు దిగి ముందుకు రాగానే పనిమనిషి వాళ్ళిద్దరికీ దిష్టి తీసింది, చాలా ఆనందంగా వుంది ఆ దంపతులకి. కాళ్ళుచేతులు కడుక్కొని లోనికి వెళ్లారు. సాక్షి వంటగదిలోకి వెళ్లి, "అత్తయ్యా! పెద్దత్తయ్యగారు, మావయ్యగారు వచ్చారు" అని వడివడిగా వెళ్ళి రాధికకు చెప్పింది.

ఎన్నో ఏళ్ల తరువాత వాళ్ళను చూస్తున్నానన్న సంబరం రాధిక నడకలో కనిపించింది. రాంప్రసాద్ ను చూసి కన్నీళ్లతోనే కుశలం అడిగింది. అతను కూడా కన్నీళ్ళతోనే సమాధానం చెప్పాడు.

"అక్కా..!" అంటూ శారదను గట్టిగా పట్టుకొని "ఎన్నాళ్ళకు చూశానక్కా" అంటూ గుండెల్లో దాచుకున్న ఆత్మీయత కళ్ళలోకి వచ్చి కన్నీరే పన్నీరై వర్షించింది.

"నీ కష్టం ఎవరూ తీర్చలేనిది రాధిక. రత్నాల్లాంటి కొడుకు, కోడలు నీకు అండ. ఎంత గొప్పగా పెంచారు వాడ్ని" అంది శారద.

"అదంతా నీ చలవే. నేను నీ బాటలోనే నడిచాను." అంది కృతజ్ఞతతో రాధిక.

ఇంతలో రాంప్రసాద్ అక్కడ ఉన్న చెక్క పడక్కుర్చీ దగ్గరకు వెళ్ళి, "ఒరేయ్ క్రాంతి, మా నాన్న పొలం నుంచి వచ్చి ఇదిగో ఈ మండువా తూము దగ్గర కాళ్ళు చేతులు కడుక్కొని ఈ పడక్కుర్చీలో కూర్చుంటే, అమ్మ ఆయనకి కాఫీ కలిపి అందించేది.నేను, తమ్ముడు ఈ స్తంభాలు పట్టుకొని ఆడుకునే వాళ్ళం. వర్షపు నీరు ఈ దోనెల్లోంచి మండువాలో పడుతుంటే భలే ఉండేది." అని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటుండగా....

సాక్షి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. కాఫీ తాగుతూ ఇల్లంతా తిరిగి చూశాడు. శారదను పిలిచి "ఇదిగో శారదా! మన గది. ఇవన్నీ నిన్ను కాపురానికి పంపినప్పుడు మీ పుట్టింటి వాళ్ళు ఇచ్చిన సామగ్రి. వాటిని కూడా చెక్కు చెదరకుండా జాగ్రత్తగా కాపాడుతున్నారు.

"అవునండి, ఇంట్లో ప్రతీదీ అప్పుడు నేను ఎలా ఉంచానో, ఇప్పుడూ అలానే ఉంచింది మా చెల్లి రాధిక. మన జ్ఞాపకాల లోగిలిని చెక్కు చెదరనీయలేదు" అంది రాధిక వైపు చూస్తూ.

"రాముడు అరణ్యవాసం సమయంలో ఆయన పాదుకలు రాజ్యమేలినట్లు. మీరు అమెరికాలో ఉంటున్నా, మీ అడుగుజాడల్లో మేము నడిచాము అక్కా" అంది రాధిక.

"మా బంగారు చెల్లివి నువ్వు" అంటూ దగ్గరకు తీసుకుంది రాధికను.

రాంప్రసాద్ పెరటి వైపు నడిచాడు. గిలక బావి, ఆ నూతి చప్టాలో ఒక పక్కగా నీళ్ళతో నింపిన పెద్ద గుండిగ, రాగి గంగాళంలో మెరుస్తూ మురుస్తున్న ఇత్తడి చెంబూ ఉన్నాయి.

"ఒరే, క్రాంతి! ఆ పక్కన పొయ్యి, మా అమ్మ చేసినట్లుగానే, అలాగే అలికి ముగ్గు పెట్టి ఉంచారు. భలే. అమ్మ దానిమీద వేన్నీళ్ళకు రాగి కాగు, ఇత్తడి దేగిసా పెట్టేది. వారం వారం నాన్నకు, నాకు, తమ్ముడికి ఒంటినిండా నువ్వులనూనె

రాసి, నలుగుతూ, అభ్యంగన స్నానం చేయించేది. ఇదిగో ఈ సిమెంటు దిమ్మమీద నాన్న కూర్చుంటే, ఆయన చేతులు మా భుజాలపై పెట్టుకొని, భలేగా మాలిష్ చేసే వాళ్ళం"

చిన్న నవ్వునవ్వి," పదండి పెదనాన్న, బంగ్లాకి వెళ్దాం. అక్కడంతా సెంట్రలైజ్డ్ ఏసి చేయించాను. సుఖంగా అక్కడే ఉందురుగాని. ముందు మీకు విశ్రాంతి అవసరం" అన్నాడు క్రాంతి. "క్రాంతి! నీకభ్యంతరం లేకపోతే నేను, పెద్దమ్మా కొంతకాలం ఈ ఇంట్లోనే ఉంటాము. దీనితో పెనవేసుకున్న జ్ఞాపకాలు ఎన్నో వున్నాయి. వాటితో తనివి తీరా గడపాలి.

అదే నాకు విశ్రాంతి. ఏమంటావ్?" అన్నాడు రాంప్రసాద్.

"మీఇష్టం పెదనాన్నా. ఇది మీ సామ్రాజ్యం. మీరెలా అంటే అలా. ముందు మీరు ఫ్రెష్ అవ్వండి. అమ్మ మీకిష్టమైన ఉప్మా పెసరట్టు రెడీ చేస్తుంది" అన్నాడు క్రాంతి.

"ఐతే ఈ రోజు వంట నేను చేస్తాను రాధికా!" అంది శారద.

"అలాగే అక్కా, నువ్వే చేద్దువు గానీ. కాకపోతే నాలుగు రోజుల తరువాత. ఇప్పటికి ఫ్రెష్ అవ్వండి అని చెప్పి, వాళ్ళ లగేజీలు లోపల పెట్టించి, పనిలోకి దిగింది రాధిక. ఆమె వెనుకే సాక్షి కూడా.

"పెదనాన్నా! ఇప్పుడే ఆకాష్ ఫోన్ చేశాడు. వాళ్ళు బయలుదేరారు రేపు ఇక్కడికి వస్తున్నారు" అన్నాడు క్రాంతి.

కుటుంబమంతా ఒకచోట చేరుతున్నందుకు అందరి ముఖాల్లో మతాబులు వెలిగాయి.

Post your comments